క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలి



సమస్యలు తెలియజేస్తున్న స్థానికుడు గోవిందరాజులు

సోంపేట: పట్టణంలోని మహాదేవిపేట, సూర్య వాస వీధి, జలంత్ర జాలరి వీధుల్లో సమస్యలను పరిష్కరించాలని పలువురు కోరారు. ఈ మేరకు పంచాయతీ ఈవో శాంతికుమారి ఆధ్వర్యంలో సోమవారం మహాదేవిపేటలో నిర్వహించిన గ్రామసభలో వినతిపత్రం అందజేశారు. ఆయా వీధుల్లో దశాబ్దాలుగా నివాసం ఉంటున్నామని, కానీ అవి 22-ఏలో నమోదు చేయబడ్డాయని పేర్కొన్నారు. అధికారులు స్పందించి 22-ఏ నుంచి తొలగించి జిరాయితీ భూములుగా గుర్తించాలన్నారు. అలాగే వేసవిలో తాగునీటి సమస్యలు పరిష్కరించాలని కోరారు. సమావేశంలో వార్డు మెంబర్ వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ఏర్పాటు



చలివేంద్రం ప్రారంభిస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా పలాస అగ్నిమాపక కేంద్రం వద్ద సోమవారం చలివేంద్రం ఏర్పాటు చేశారు. అగ్నిమాపక అధికారి సోమేశ్వరరావు సమక్షంలో స్థానిక కౌన్సిలర్ టి.ఆనందరావు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. కార్యక్రమంలో అగ్నిమాపక అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రమోషన్లకు సహకరించండి



ఎమ్మెల్యే శిరీషకు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

కాశీబుగ్గ: తమకు ప్రమోషన్లు కల్పించాలని సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్లు కోరారు. ఈ మేరకు ఎమ్మెల్యే గౌతు శిరీషను సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. దీంతో ఆమె మాట్లాడుతూ సోషల్ వెల్ఫేర్ శాఖ మంత్రి, ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకెళ్తానని తెలిపారు.

రోడ్డు ప్రమాదాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ శ్రీనివాస్

ఇచ్ఛాపురం రూరల్: రోడ్డు ప్రమాదాలపై ఇచ్ఛాపురం రూరల్ ఎస్ఐ ఈ.శ్రీనివాసరెడ్డి మంగళవారం ఎం.తోటూరులో వాహన చోదకులకు అవగాహన కల్పించారు. సంకల్పం కార్యక్రమంలో భాగంగా హెల్మెట్ వినియోగం, సైబర్ నేరాలు, శక్తి యాప్‌లపై వివరించారు. స్మార్ట్ మొబైల్ ఉన్నవారు శక్తియాప్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు.

అక్రమంగా ఆశీల వసూళ్లు

టెక్కలి: టెక్కలి మేజర్ పంచాయతీ పరిధిలో అక్రమంగా ఆశీలు వసూళ్లు చేయడంపై పలువురు వ్యాపారస్తులు మండిపడుతున్నారు. పంచాయతీ పరిధిలో సొంత దుకాణాలు, అద్దె దుకాణాల నుంచి రోజువారీ ఆశీలు వసూళ్లు చేస్తుండడంపై అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. వాస్తవానికి ప్రతిరోజూ ఇతర ప్రాంతాల నుంచి పట్టణానికి వచ్చి వివిధ రకాల వస్తువులు అమ్మకాలు చేసిన వారి నుంచి మాత్రమే ఆశీలు వసూళ్లు చేసేవారు. దీనికి విరుద్ధంగా ప్రస్తుతం చిన్నపాటి దుకాణాల నుంచి ఆశీలు వసూళ్లు చేస్తుండడం గమనార్హం. గతంలో ఎన్నడూ ఇటువంటి పరిస్థితి లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై ఇన్‌చార్జి ఈవో శశిధర్ వద్ద ప్రస్తావించగా దుకాణాల నుంచి ఎటువంటి రోజువారీ ఆశీలు వసూళ్లు చేయకూడదని, దీనిపై సంబంధిత పాటదారులను హెచ్చరిస్తామని తెలియజేశారు.

జాతీయ కార్యదర్శిగా గురునాథ్



నియామకపత్రాన్ని అందుకుంటున్న గురునాథ్

టెక్కలి: బీసీ సంఘం జాతీయ కార్యదర్శిగా టెక్కలికి చెందిన యాదవ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు జి.గురునాథ్ యాదవ్‌ను నియమించారు. జిల్లా కేంద్రంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో భాగంగా సంఘం అధ్యక్షుడు లాకా వెంగళ్రావు చేతులమీదుగా నియామక పత్రాన్ని అందుకున్నట్లు పేర్కొన్నారు. బీసీ వర్గాల సంక్షేమానికి జాతీయ స్థాయిలో కృషి చేస్తానని తెలియజేశారు.

ఆదర్శప్రాయుడు అంబేడ్కర్

నేటి యువతకు అంబేడ్కర్ ఆదర్శప్రాయుడని వక్తలు పేర్కొన్నారు. ఇచ్ఛాపురం, పలాస, టెక్కలి నియోజకవర్గాల్లో అంబేడ్కర్ జయంతి వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన విగ్రహాలు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. దేశానికి చేసిన సేవలను గుర్తు చేసుకున్నారు. ఆయన ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలన్నారు.

– సాక్షి నెట్‌వర్క్



టెక్కలి: వలియాసాగరంలో అంబేడ్కర్ విగ్రహావిష్కరణ



వజ్రపుకొత్తూరు: అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీడీవో రమేష్ నాయుడు తదితరులు



టెక్కలి: అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పేరాడ తిలక్ తదితరులు



కవిటి: బొరివంకలో నివాళులర్పిస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావు



కవిటి: అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న ఎంపీపీ కడియాల పద్మ తదితరులు



సంతబొమ్మాళి: బోరుభద్ర గ్రామంలో...



సోంపేట: పలాసపురం గ్రామంలో...



సోంపేట: బారువ గ్రామంలో...



సోంపేట: బెంకిలి పంచాయతీలో...



నందిగాంలో నివాళులర్పిస్తున్న పేరాడ తిలక్ తదితరులు



నందిగాం: పెద్దబాణాపురంలో...



ఇచ్ఛాపురంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో...



కాశీబుగ్గ: హరిజన వీధిలో...



కాశీబుగ్గ: అంబేడ్కర్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న మున్సిపల్ చైర్మన్ గిరిబాబు తదితరులు



కాశీబుగ్గ: అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



మందస: సొండిపూడి పాఠశాలలో విగ్రహావిష్కరణ



మందస: కొత్తపల్లి గ్రామంలో...



పలాస: మండల పరిషత్ కార్యాలయంలో...



ఇచ్ఛాపురం టౌన్: నివాళులర్పిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



ఇచ్ఛాపురం టౌన్: నివాళులర్పిస్తున్న దళిత నాయకులు



కంచిలి: అంబేడ్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న పిరియా విజయ తదితరులు



కంచిలి: బూరగాం గ్రామంలో...

ఆలయ అభివృద్ధికి రూ.5 లక్షలు మంజూరు





జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎమ్మెల్సీ నర్తు రామారావులను సన్మానిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

కవిటి: ఉద్దానం ప్రజల ఆరాధ్య దైవం కవిటి చింతామణి అమ్మవారి గుడి అభివృద్ధి పనులకు రూ.5 లక్షల నిధులు మంజూరు చేస్తున్నామని జెడ్పీ చైర్‌పర్సన్ పిరియా విజయ అన్నారు. సోమవారం ఆమెతో పాటు ఎమ్మెల్సీ నర్తు రామారావు, ఎంపీపీ కడియాల పద్మ, ప్రకాష్‌లు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యులు వారిని సన్మానించారు.

బీఎల్‌వోలకు శిక్షణ నేడు

ఇచ్ఛాపురం టౌన్: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు స్థానిక రోటరీ క్లబ్‌లో నియోజకవర్గంలోని బీఎల్‌వోలకు మంగళవారం శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తహసీల్దార్ ఎం.వెంకటరావు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమానికి నాలుగు మండలాల తహసీల్దార్లు, బీఎల్‌వోలు హాజరవ్వాలని స్పష్టం చేశారు. అదేవిధంగా వివిధ రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించడం జరుగుతుందన్నారు.

అగ్ని ప్రమాదాలపై అప్రమత్తత అవసరం



సోంపేట: అమరవీరులకు నివాళులర్పిస్తున్న అగ్నిమాపక సిబ్బంది

టెక్కలి: అగ్ని ప్రమాదాలపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని కోటబొమ్మాళి అగ్నిమాపక శాఖ అధికారి రుక్మాంధర్‌రెడ్డి సూచించారు. స్థానిక అగ్నిమాపక కార్యాలయంలో అగ్నిమాపక వారోత్సవాలను సోమవారం ప్రారంభించారు. అగ్ని ప్రమాదాల నివారణపై తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

సోంపేట: అగ్నిమాపక వారోత్సవాల సందర్భంగా అమరవీరుల సేవలను ప్రతిఏటా స్మరించుకుంటున్నామని సోంపేట అగ్నిమాపక శాఖాధికారి ఎస్.మోహనరావు అన్నారు. అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక అగ్నిమాపక కేంద్రంలో సోమవారం అమరులకు నివాళులర్పించారు.

నేత్రపర్వంగా శ్రీరామ పట్టాభిషేకం

కవిటి:

మండలంలోని డి.గొనపపుట్టుగ రామాలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు సోమవారంతో ముగిశాయి. దీనిలో భాగంగా ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో చివరి రోజు పట్టాభిషేక మహోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. భద్రాచలం రామాలయంలో నిర్వహించే రీతిలో ఈ ఉత్సవాలను ప్రతీఏటా నిర్వహించడం విశేషం. అనంతరం అన్నప్రసాద వితరణ చేపట్టారు.



శ్రీరామ పట్టాభిషేక ఉత్సవ ఘట్టం

భక్తిశ్రద్ధలతో పూజలు

కవిటి: ఉద్దానం ప్రజల ఆరాధ్య దైవం, కవిటిలో వెలసిన చింతామణి అమ్మవారికి సోమవారం మేష సంక్రమణం పురస్కరించుకొని భక్తిశ్రద్ధలతో పూజలు నిర్వహించారు. స్థానిక ఉషోదయ యువజన సంఘం ఆధ్వర్యంలో ప్రతిఏటా ఈ ఉత్సవాలను సాంప్రదాయబద్ధంగా నిర్వహిస్తున్నారు. అనంతరం మహిళలు సామూహిక కుంకుమార్చనలు చేపట్టారు. మధ్యాహ్నం అన్నదానం ఏర్పాటు చేశారు. కార్యక్రమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం: గ్రామ దేవత స్వేచ్ఛావతి అమ్మవారి ఆలయంతో పాటు పట్టణంలోని పలు ఆలయాల్లో సంక్రమణం పూజలు సోమవారం చేపట్టారు. స్వేచ్ఛావతి అమ్మవారికి తైలమర్దన, సిందూరమర్దన, పంచామృత అభిషేకాలు చేపట్టారు. పానకంతో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి, ఆ పానకాన్ని పట్టణంలోని ప్రధాన కూడళ్లలో ప్రజలకు పంపిణీ చేశారు.

ఇదేం పద్ధతి..?

- బోరుభద్ర రోడ్డు విస్తరణలో పక్షపాతం..?
- కొలతల్లో తేడా చేశారని స్థానికుల ఆరోపణ



గ్రామంలో కూల్చివేసిన నిర్మాణాలు



అస్తవ్యస్తంగా ఉన్న మురికి కాలువ నిర్మాణం

సంతబొమ్మాళి: మండలంలోని బోరుభద్ర గ్రామంలో చేపడుతున్న రోడ్డు విస్తరణ పనుల్లో అధికారులు పక్షపాతంగా వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. చాలాచోట్ల కొలతల్లో తేడాలు ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వివరాల్లోకి వెళ్తే.. గ్రామంలోని ఇసుక బంధ చెరువు నుంచి శివాలయం వరకు సుమారు రూ.2.50 కోట్ల ఉపాధి నిధులతో రోడ్డు విస్తరణ పనులు చేపడుతున్నారు. దీంతో పంచాయతీరాజ్ అధికారులు రోడ్డు మధ్య నుంచి ఇరువైపులా 25 అడుగులకు మార్కింగ్ ఇచ్చారు. అయితే మార్కింగ్‌కు అనుగుణంగా కూల్చివేతలు జరగడం లేదని పలువురు పేర్కొంటున్నారు. ఒక దగ్గర 20 అడుగులు, మరోచోట 22 అడుగులు, ఇంకోచోట 24 అడుగుల వరకు కూల్చివేతలు అధికారులు చేపట్టారని చెబుతున్నారు. పేదల ఇళ్లను కొలతల ప్రకారం కూల్చివేసి, వ్యాపారస్తుల ఇళ్ల జోలికి వెళ్లడం లేదని వాపోతున్నారు. అదేవిధంగా కాలువల నిర్మాణ పనులు సైతం వంకరటింకరగా చేపట్టినట్లు ఆరోపిస్తున్నారు. దీనిపై పంచాయతీరాజ్ ఉన్నతాధికారులు సైతం అభ్యంతరం వ్యక్తం చేసిన సందర్భాలు ఉన్నాయన్నారు. ఇష్టానుసారంగా కాలువల నిర్మాణ పనులు చేపట్టడంతో మురుగు నీరు ఎటు వెళ్తోందో తెలియని పరిస్థితి నెలకొందని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి అందరినీ ఒకేలా చూడకుంటే ఆందోళన తప్పదని హెచ్చరిస్తున్నారు.

కొలతల్లో వ్యత్యాసం చూపారు

రోడ్డు విస్తరణ కొలతల్లో అధికారులు వ్యత్యాసం చూపారు. పేదలపై ఒక రకంగా, వ్యాపారస్తులతో మరోరకంగా వ్యవహరిస్తూ పక్షపాతం చూపిస్తున్నారు. మురికి కాలువ నిర్మాణం కూడా అస్తవ్యస్తంగా చేపట్టారు. అందరి విషయంలో ఒకేలా వ్యవహరించాలి.

– సీహెచ్ చిన్నారావు, బోరుభద్ర

కొలతల ప్రకారమే చేశాం

రోడ్డు విస్తరణలో భాగంగా బోరుభద్రలో ఇరువైపులా కొలతల ప్రకారమే ఇళ్లను కూల్చివేశాము. కొన్నిచోట్ల పెంచామని, మరికొన్నిచోట్ల తగ్గించామని ఎవరూ ఇంతవరకు అభ్యంతరం చెప్పలేదు. కొలతల్లో తేడాలు చేసినట్లు నా దృష్టికి రాలేదు. దీనిపై పరిశీలన చేస్తాం.

– అంజిత్ కుమార్, పంచాయతీరాజ్, ఏఈ, సంతబొమ్మాళి

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండల కేంద్రంలోని అయ్యప్ప స్వామి ఆలయ వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఆలయ పురోహితులు సుసరావు, కృష్ణస్వామి ఆధ్వర్యంలో వేకువజాము నుంచే అయ్యప్ప దీక్ష స్వాములు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం స్వామివారికి తిరువీధి చేపట్టారు.